


# అసంతృప్తిలో తృప్తి

—కప్పగంతుల మల్లికార్జునరావు

• • • •

సత్యప్రియ నవల వ్రాద్దామని కాగితాలు ముందేసుకు కూర్చుంది. కాని, కలం సాగితేనా? హనుమత్ ప్రసాద్ ఉత్తరం తీసి చదవసాగింది.

"మై డియర్ అభిమాన రచయిత్రీ!

"ఏమున్నా లేకపోయినా, ఎక్కడ ఉన్నా, ఎంత పెద్ద వాళ్ళయినా తెలుగువాళ్ళకు జెలసీ జన్మహక్కని మనవాళ్ళు చాలా గొప్పగా ప్రూవ్ చేశారుకదూ? ఫూల్స్! ఎంత చదువుకొన్నా వాళ్ళు మన ఎత్తుకు ఎదగటానికి మరో మూడు దశాబ్దాలు పట్టుతుంది. ఐ పిటీ దెమ్. ఏమైనా అంతా మన మంచికోసమే అనుకొంటున్నా. తన్నితే గారెల బుట్టలో పడ్డట్లు మద్రాసు చేరుకొన్నాను నేను. బోలెడన్ని పిక్చర్స్. బిజీ—వెరీ వెరీ బిజీ. కానీ, మునుపటంత స్పీడుగా ఎందుచేతో వ్రాయలేకపోతున్నా. డాక్టర్లకు చూపిస్తే జబ్బేం లేదన్నారు..."

అకస్మాత్తుగా పైనుంచి ఎండుగడ్డి పరకలు గుట్ట ఉత్తరంమీద పడి అక్షరాలను కప్పేశాయి.

కోపంగా తల ఎత్తి చూచింది సత్యప్రియ. పిచ్చుకలు. సవ్వడి చేస్తూ ఎగురుతున్నాయి.

'ఛీ! వెధవ పిచ్చుకలు' అని విసుక్కుంది. "హుష్!" అంటూ వాటిని బెదిరించి తరిమింది. అవి బయటికి పోయినట్లే పోయి మళ్ళీ సవ్వడి చేసుకొంటూ ఎగిరి వచ్చాయి.

ఆమె ఆ ఇంట్లో ప్రవేశించేనాటికే పిచ్చుకలు గృహ ప్రవేశం చేసి ఉన్నాయి. సరిగ్గా బెడ్‌రూమ్‌లో ఆమె వ్రాసుకునే బల్లకు పైగా ఉన్న ఒక టేకు వాసం వాటి స్థావరం. గడ్డి పరకలు, సన్న సన్న పుల్లలు, దూది, కాగితం, గుడ్డముక్కలు— ఎక్కడినుంచి తెస్తాయో నిమిషంలో గూడు కడతాయి. మంచి మూడ్‌లో ఆమె వ్రాసుకొంటున్నప్పుడు అవి శబ్దం చేసినా, నెత్తిపైన గడ్డి పరకలు పడ్డా ఆమెకు గొప్ప చిరాకు. ఎన్నిసార్లు అవి కట్టుకొన్న గూళ్ళను కర్రతో తీసిపారేసిందో? అయినా పిచ్చుకలు ఆ గది వదిలిపోతేనా?

ఆమధ్య రెండు పిచ్చుకలు వాసాన్ని ముక్కులతో పొడిచి రంధ్రం చేశాయి. మనసు ఉల్లాసంగా ఉన్నప్పుడు వాటి చర్యలను కనిపెట్టటం సత్యప్రియకు కూడా సరదానే. అలాంటి సమయంలో అబ్జర్వ్ చేసి ఆ రెండు పిచ్చుకలు భార్యా భర్తలని తేల్చింది. వాసానికి ఉన్న రంధ్రం వాటి స్థావరం. మరి ఈ గడ్డి పరకల్నేం చేస్తాయో? పాన్పు చేసుకొంటాయా? లేక పుట్టబోయే పిల్లలకు రక్షణ ఏర్పాటా?

అయితే ఆ క్షణంలో సత్యప్రియకు అలాంటి ఆలోచనలు రాలేదు. చరాకుగా గడ్డి పరకల్ని విదిలించుకొంది. ఉత్తరం చదవటానికి ఉపక్రమించింది మళ్ళీ.

"అప్పట్లో నీ నవలను సినిమా తీసే విషయంలో అంతా ఫైనలైజు అయిపోయింది. మాటల రచయిత్రివి కూడా నువ్వే. కథ, మాటలు ఒక పిక్చర్‌కి వ్రాసిన కొద్దిమంది రచయిత్రుల్లో నువ్వూ ఒకదానివవుతావన్న భావన చాలా గ్రాండ్‌గా లేదూ? విష్ యు గుడ్ లక్! అయినా, నీలాంటి ప్రతిభావంతులు ఎక్కడ ఎవరిదగ్గర ఉంటే రాణిస్తారో వారి దగ్గర ఉండటం రైట్. ఏమ్: ఐ కరెక్ట్ ?

"ప్రొడ్యూసర్‌నుంచి ఉత్తరం రాగానే వచ్చేస్తావు కదూ? వెల్‌కమ్!"

ఆశ, ఆకర్షణ క్షణంలో ఆమెను మద్రాసు లాక్కుపోయాయి. పేరు, పొగడ్తలు, సన్మానాలు, బిరుదులు ఇప్పించాయి.

ఆమె చాలా ఎత్తుగా ఎదిగింది. ఎదిగి క్రిందికి చూస్తే మోహన్ కుమార్ మరుగుజ్జుగా కనిపించాడు. విడాకుల పత్రమందుకున్నా లేదేం ?

ఆమె శరీరాన్ని ఒక అందమైన భయం ఆవహించింది. చెమటతో తడిసి ముద్దయింది.

రేపు సీలింగ్ ఫాన్ స్విచ్ నొక్కింది.

అరె ! అదేమిటి? ఫాను రెక్క ఒక పిచ్చుకకు తగిలింది. తెల్లటి ఈకలు గది అంతా వింతగా నాట్యం చేస్తున్నాయి.

సన్నగా అరుస్తూ, పిచ్చుక క్రిందపడింది.

వాసం గూటి దగ్గర ఉన్న రెండవ పిచ్చుక అరిచింది. పిలిచినట్లు మరి కొన్ని పిచ్చుకలు ఎక్కడినుంచో వచ్చాయి.

సత్యప్రియ వాటి రాకను గమనించలేదు. క్రిందపడ్డ పిచ్చుకమీదనే ఆమె దృష్టంతా. అది చావలేదు. ఎగరలేక భయంతో అటూ ఇటూ కదులుతూంది. సత్యప్రియకు దానిమీద జాలివేసింది. ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకొంది. బియ్యం తినిపించటానికి, నీళ్ళు పాలు తాగించటానికి ప్రయత్నించింది. మరెన్నో ఉపచారాలు చేసింది.

అప్పటికి కాని పిచ్చుకల రణగొణ ధ్వనిని ఆమె గ్రహించలేదు. పిచ్చుకల గోల చూచి భయంతో చేతిలో పిచ్చుకను వదిలేసింది. పిచ్చుక కాస్త కోలుకొన్నట్లుంది. ఎగిరి గూటిదగ్గరికి చేరింది. అయితే, మిగతా పిచ్చుకలు దానిని గూడు చేరనివ్వలేదు. గదినుంచి బయటికి తరిమాయి. బయటికి వెళ్ళాక అన్ని కలిసి దాన్ని క్రింద పడవేశాయి. పొడిచి పొడిచి చంపాయి.

అంతా ఒక్క క్షణంలో సత్యప్రియకంటి ముందు జరిగిపోయింది.

క్షణం క్రితం తన చేతిలో ఉన్న పిచ్చుక—తన ఆప్యాయతను ఆతిధ్యాన్ని పొందిన పిచ్చుక—ఇప్పుడు నేలమీద విగత జీవి అయి పడి ఉంది !

మాంసం కోసమో, వైద్యం కోసమో, సరదాగానో మనిషి చంపలేదు దాన్ని. తోడి పిచ్చుకలు చంపి పారేశాయి. ఎందుకు?

"మడిసి ముట్టిన పిచ్చుకను మిగతా పిచ్చుకలు మళ్ళీ తమ గూడు సేరనివ్వవమ్మగోరూ! పొడిసి సంపేత్తాయి. కాకులూ అంతే! తెల్వదా మీకు?"

పనిమనిషి మాటలు చిత్రంగా వినిపించాయి సత్యప్రియకు.

"కానీ, ఎందుకు?" ప్రశ్న.

"ఎందుకంటే—ఏం సెప్పగలనమ్మగోరూ? అదంతే. నే నో యిసయం సెప్పనా, అమ్మగోరూ? మడుసులం—మనం గొప్పోళ్ళమని మహా యిర్రయిగిపోతుంటాం కాని, మనకన్నా నోరులేని పక్షులకే జాతి, నీతి ఎక్కువగా ఉన్నాయండమ్మగోరూ! నీతి నియమాలు లేని మడిసి ముట్టితే తమ జాతి, నీతి, పాతివ్రత్యం పోతయ్యని ఆటికి బయమేమో! నేకపోతే మీరే సూసేరుగా— ఎందుకు సంపుతాయి?"

పనిమనిషి పనిలోకి వెళ్ళింది. సత్యప్రియకు భయం వేసింది. చేతుల్ని చూచుకొంది. అవి అపవిత్రమయ్యాయా? ఉహుఁ కాని, మనస్సు? పిచ్చుకలకే అంత పవిత్రత, నీతి ఉంటే మనుష్యులకు మరెంత ఉండాలి?

గది లోపలికి వచ్చింది.

వాసంమీద గూటి దగ్గర ఒక పిచ్చుక మాత్రమే ఒంటరిగా, చలన రహితంగా, దిగులుగా కూర్చుని ఉంది.



మగ పిచ్చుకో? ఆడ పిచ్చుకో? ఏదైనా ఒంటరిదేగా! దాంపత్యం విచ్ఛేదం అయిందికదా?

గూటికోసం ఆ జంట పోగుచేసిన గడ్డి పరకలు, పుల్లముక్కలు, గుడ్డ పీలికలు—గదంతా చెల్లా చెదురుగా పడి ఉన్నాయి.

"అమ్మగోరూ ! గది వూడ్చమంటారా?"

"ఒక్క క్షణం."

సత్యప్రియ మనసు అనే గదిని ముందు వూడ్చి శుభ్రం చేసింది. హనుమత్ ప్రసాద్ ఉత్తరాన్ని చించి చిన్న చిన్న ముక్కలు చేసి పారేసింది.

• • •

ఆ రాత్రి భర్త అడగకుండానే తన మనోభావాలతో సహా ఆ రోజు జరిగినదంతా చెప్పింది సత్యప్రియ.

"ఇన్నాళ్ళూ నేను చేసిన మానసిక వ్యభిచారాన్ని తలుచుకుంటే నా తల సిగ్గుతో నేలకు వంగిపోతున్నది. నన్ను క్షమించరూ?"



నును సిగ్గు దొంతరలు ఫోటో – ఎ. వి. రంగయ్య

"ఆశా వ్యామోహాలు, కామక్రోధాలు, మదమాత్సర్యాలుమనుష్యులందరికీ సహజమేకదా! క్షమించటానికేముంది? కానీ, ఆ పిచ్చుకలకు మనిద్దరం కృతజ్ఞతలు చెప్పుకోవాలి కదూ?"

"మనిషి తాకిన పిచ్చుకను మిగతా పిచ్చుకలు ఎందుకు చంపుతాయో చెప్పరూ? సైంటిఫిక్ ఎక్స్‌ప్లనేషన్ కావాలి నాకు."

"అనుభవంవేసే అనేక ప్రశ్నలకు సైన్సు సమాధానా లివ్వలేదు. జువాలజిస్టులే సమాధానం ఇవ్వలేని ప్రశ్న నీది. కెమిస్టును నేనేం సమాధానం ఇవ్వగలను? పరిశీలించి తెలుసుకొనేదాకా, అనుభవంతో పని మనిషి చెప్పిన మాటల్నే నమ్ముదాం."

ఆ రాత్రి సత్యప్రియకు తొలిరాత్రికన్నా మధురంగా కనిపించింది. కారణం? అంటుకొని ఉన్న కాస్తంత మాలిన్యాన్ని కడిగేసుకొని నిర్మలమైన ఆమె మనసు, ఆమె జీవన దృక్పథంలో తెచ్చిన మార్పుకి ప్రతీక ఆ భావన!

★